క్లుప్తంగా

ప్రత్యేక ప్రార్థనల్లో తుడా చైర్మన్



ఇజితీమా కార్యక్రమంలో పాల్గొన్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట: ఎర్రావారిపాళెం మండలం నెరబైలు పంచాయతీ తురకపల్లిలో జరిగిన జిల్లా స్థాయి ఇజితీమా కార్యక్రమంలో తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ధర్మం బతకాలంటే మనం దైవమార్గంలో నడవాలన్నారు. ఇజితీమా కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెమ్మ, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివకుమార్‌కు నివాళి



శివకుమార్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి బొమ్మగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శివకుమార్‌కి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నివాళులర్పించారు. శివకుమార్ మృతి చెందిన విషయం తెలిసి ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి ఆదివారం బొమ్మగుంట వద్ద నివాసం ఉన్న శివకుమార్ నివాసానికి వెళ్లి అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్న వయసులోనే మృతి చెందడం బాధాకరమని, మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, అండగా తాను ఉంటానని భరోసా ఇచ్చారు.

తిరుపతి గంగమ్మకు విశేష పూజలు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువు కట్ట మీద వెలసిన శ్రీ తిరుపతి గంగమ్మకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చనలు చేపట్టారు. మార్గశిర మాసం, పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఓంశక్తి మాలదారులచే ప్రత్యేక పూజలు, భజనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం ఓంశక్తి మాలధారులు ఇరుముడి దీక్షతో బయలుదేరారు. భక్తులకు ఆలయ ధర్మకర్తలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా కమిషనర్ హరిత జన్మదిన వేడుకలు



కమిషనర్ హరితకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, తిరుపతి స్మార్ట్‌సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డి.హరిత పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభయక్షేత్రం, లీలామహల్ కూడలి ప్రాంతాల్లో పేదలకు, అభాగ్యులకు పెద్దఎత్తున అన్నదానం చేశారు. పలువురు అధికారులు కమిషనర్ హరితను కలిసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రరెడ్డి, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, డీఈఈలు విజయ్‌కుమార్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మహేష్, నాయక్, శ్రావణి, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మధుసూదన్ రెడ్డి, సూరిబాబు, ప్రకాష్, రామ్మోహన్ రెడ్డి, శంకర్, శ్రీనివాసులు రెడ్డి, జ్యోతిరెడ్డి, శశికుమార్, గిరిబాబు, రెడ్డప్ప పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో ప్రమాదం

తిరుమల: తిరుమల రెండో ఘాట్‌రోడ్‌లో ఆదివారం ఓ వాహనం అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొంది. వివరాలు.. తమిళనాడుకు చెందిన భక్తులు తిరుమలకు వస్తుండగా మూడో కిలోమీటర్ వద్ద ప్రమాదం జరిగింది. దీంతో ఇద్దరు భక్తులు గాయపడ్డారు. క్షతగాత్రులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

యువతిని బెదిరించి దోపిడీ

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం వకులమాత ఆలయం సమీపంలో యువతిని బెదిరించి గుర్తు తెలియని వ్యక్తులు దోపిడీ చేశారు. పుంగనూరుకు చెందిన మునస్వామి కొడుకు దేవకుమార్ తన సమీప బంధువు మాధవితో కలిసి ఆదివారం వాహనంలో తిరుపతి నుంచి పుంగనూరుకు వెళ్తున్నారు. అయితే వకులమాత ఆలయం సమీపంలో బహిర్భూమి కోసం యువతి కారు దిగింది. అదే సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మాధవిని బెదిరించి ఆమె చేతికున్న మూడు ఉంగరాలను దోచుకెళ్లారు. అంతేగాకుండా ఆమె చేతిలోని సెల్ ఫోన్‌ను సైతం లాక్కున్నారు. దేవకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తిరుపతి రూరల్ ఎస్‌ఐ మూర్తి తెలిపారు.

అయ్యగారి ఆదేశాలకు 100 రోజులు

అమలుకు ఎన్ని రోజులో ?

- ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుపాస్‌ల జారీ సెంటర్ మార్పు చేయాలని 3 నెలల కిందట డీపీటీఓ ఆదేశాలు
- సెంటర్ మార్పు చర్యలు మాత్రం శూన్యం
- అదేచోట విద్యుత్ బస్సుల చార్జింగ్ పాయింట్లు
- పాస్ తీసుకోవాలంటే విద్యార్థులు, దివ్యాంగులకు తప్పని తిప్పలు





బస్సు పాస్‌లు జారీ చేసే సెంటర్ వద్ద నిలిపిన బైక్‌లు, విద్యుత్ బస్సుల తాకిడి

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలోని ఏడుకొండల బస్టాండ్‌కు ఉత్తరం వైపున చిన్నపాటి గదిలో విద్యార్థులు, దివ్యాంగులు, జర్నలిస్టులు తదితర అన్నిరకాల ఆర్టీసీ బస్సు పాస్‌లను జారీ చేస్తుంటారు. అయితే ఆ బస్సు పాస్‌ల సెంటర్‌కు ఎదురుగా ఆరు నెలల క్రితం 13 విద్యుత్ బస్సులకు చెందిన చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నిత్యం ఆ మార్గంలో విద్యుత్ బస్సుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. పైగా ఆ మార్గంలో వెళ్లాలంటే ట్రాఫిక్ ఇక్కట్లు నెలకొన్నాయి. దీనికితోడు బస్సుపాస్‌ల జారీ సెంటర్ వద్దే ఏడుకొండల బస్టాండ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. దీంతో ప్రధానంగా విద్యార్థులు, దివ్యాంగులు బస్సు పాస్‌లు తీసుకోవడం కష్టంగా మారింది. దీనిపై పలువురు జిల్లా ప్రజా రవాణా అధికారికి ఇబ్బందులను వివరించారు. వెంటనే స్పందించిన డీపీటీఓ చెంగల్‌రెడ్డి మూడు నెలల క్రితం ఆ ప్రాంతాన్ని పరిశీలించి, వెంటనే బస్సు పాస్‌ల జారీ సెంటర్‌ను మార్పు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇంతవరకు చర్యలు శూన్యం. ఆయన ఆదేశాలు ఇచ్చి వంద రోజులు గడిచింది. అయితే ఇప్పటికీ అమలు చేయాల్సిన సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో బస్సు పాస్‌లను తీసుకోవాలంటే బిక్కు బిక్కుమంటూ ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటూ విద్యార్థులు, దివ్యాంగులు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

త్వరలో చర్యలు తీసుకుంటాం..



బస్సు పాస్‌ల జారీ సెంటర్‌ను మార్పు చేయాలని డీపీటీఓ ఆదేశాలు ఇచ్చారు. అదేచోట విద్యుత్ బస్సుల చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయడం వాస్తవమే. దాంతో ఇబ్బందులు లేకుండా మరోచోటుకు మార్పు చేయాలని వెల్లడించారు. త్వరలో విద్యార్థులకు ఇక్కట్లు లేకుండా చర్యలు చేపడుతాం.

–డీఆర్ నాయుడు, ఏటీఎం, తిరుపతి సెంట్రల్ బస్టాండ్

ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం



పులిబోను పోలీసు ఔట్‌పోస్టు వద్ద ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

చంద్రగిరి : ఎర్రచందనం స్మగ్లింగ్‌ను ఉక్కుపాదంతో అణచివేస్తామని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కల్యాణీ డ్యామ్, శ్రీవారి మెట్టు ప్రాంతాల్లోని పులిబోనుతో పాటు పోలీస్ ఔట్ పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునే సమయంలో పాటించవలసిన మెలకువలను వివరించారు. ఈ ప్రాంతంలో నిత్యం వన్యప్రాణులు సంచరిస్తుంటాయి, కాబట్టి విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అదే సమయంలో విష పురుగుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గత ఏడాది ఎర్రదొంగలపై నిఘా పెంచడం ద్వారా 15 కేసులు నమోదు చేసి 76 మందిని అరెస్టు చేసి, సుమారు రూ.10 కోట్ల విలువైన 19,298 కిలోల 975 దుంగలను, 34 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అలాగే 597 మంది పాత నేరస్తులపై ఎరచ్రందనం హిస్టరీ షీట్లు తెరిచి వారిపై నిఘా ఉంచి కట్టడి చేస్తున్నామన్నారు. ఎర్రచందనం రవాణాపై ప్రజలకు ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100కు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీలు యశ్వంత్, రవీంద్రారెడ్డి, సీఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కులను సాధిద్దాం



పేద విద్యార్థికి నగదు చెక్కును అందజేస్తున్న చంద్రశేఖర్, వక్తలు

తిరుపతి కల్చరల్: దళితులంతా ఐక్యతతో హక్కులను సాధించుకోవాలని, తద్వారా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. దళిత సంక్షేమ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్వీ యూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో దళితుల సమావేశం నిర్వహించారు. దీనికిముందు బాలాజీ కాలనీలోని అంబేడ్కర్ భవన్ నుంచి యూనివర్సిటీ వరకు చేపట్టి అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు విశ్రాంత జడ్జి పి.గుర్రప్ప, డీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రామ్మూర్తి, టీటీడీ ఎస్సీ ఎంప్లాయిస్ సంఘ నేత ఎం.ప్రసాద్‌రావు, ప్రొఫెసర్ సుధాకరయ్య, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ దినకరమూర్తి ప్రసంగించారు. రాజ్యాంగపరంగా దళితులకు అందాల్సిన హక్కులను సమగ్రంగా అందడం లేదని, వీటిని సమగ్రంగా అందించి వారి అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దళితులకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేసిన వారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను, రాజ్యాంగాన్ని 6వ తరగతి నుంచి పీజీ వరకు పాఠ్యాంశంగా పుస్తకాలలో చేర్చాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసి బహుజనుల అభ్యున్నతికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చిత్తూరు, తిరుపతి జిల్లాలోని 24 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున డీఎస్ఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ లక్షల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో దళిత సంక్షేమ సేవా సంఘ నేతలు శివాజీ, సుధాకరయ్య, దళితులు పాల్గొన్నారు.

ఆలయాల పనుల పరిశీలన



తాళ్లపాక పెద్దగంగమ్మ ఆలయ ఆధునీకరణ పనులను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన



వేశాలమ్మ ఆలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: పట్టణంలోని తాళ్లపాక పెద్ద గంగమ్మ, వేశాలమ్మ ఆలయాల ఆధునీకరణ పనులను టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఆలయాలలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆధ్యాత్మిక వాతావరణం ప్రతిబింబించేలా ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని సూచించారు.

బైక్‌ను ఢీకొన్న కారు

చంద్రగిరి: మండలంలోని మామండూరు సమీపంలో జాతీయ రహదారిపై స్కూటర్‌ను కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం..భాకరాపేట గాంధీనగర్‌కు చెందిన నారాయణ, కళ్యాణ్ చక్రవర్తి రామచంద్రపురం మండలం నూతుగుంటపల్లిలో జల్లికట్టును తిలకించేందుకు బైక్‌పై బయలుదేరారు. ఐతేపల్లె సమీపంలోని దాబాలో భోజనం చేసి తిరిగి హైవేలోకి వస్తుండగా చిత్తూరు వైపు నుంచి రాజమండ్రికి వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో కళ్యాణ్ చక్రవర్తి, నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కళ్యాణ్ చక్రవర్తి(35)మృతిచెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చంద్రగిరి సీఐ రాజశేఖర్ తెలిపారు.

ఏపీపీఎస్‌టీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఏపీపీఎస్‌టీఎఫ్ తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు

తిరుపతి ఎడ్యుకేషన్: ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరమ్(ఏపీపీఎస్‌టీఎఫ్) తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం తిరుపతిలోని టీపీపీఎం నగరపాలక పాఠశాల ఆవరణలో ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో గౌరవాధ్యక్షుడిగా కేడీ సారథి, అధ్యక్షులుగా జి.మోహన్‌నాయుడు, ఉపాధ్యక్షులుగా పి.రవి, ప్రధాన కార్యదర్శిగా కే.మేఘనాథ్, ఆర్థిక కార్యదర్శిగా టి.మనోహర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎస్.కోదండపాణి, కె.రాజేష్‌బాబు, మహిళా కార్యదర్శులుగా ఎన్.సౌజన్య, కె.రాధారాణి, సంయుక్త కార్యదర్శులుగా డి.ధనుంజయ, ఎ.మోహన్, డివిజినల్ కార్యదర్శులుగా కె.వెంకటేశ్వర, ఎస్.గజరాజన్, ఎం.సుబ్బరామయ్య, బి.రాజ్‌కుమార్, పి.కోటేశ్వరరావు, చెంగల్వరాయులు ఎన్నికయ్యారు. ఎన్నికైన తిరుపతి జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.మోహన్‌బాబు అభినందించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



కూచిపూడి నృత్యాలు చేస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. తిరుపతి సాయినాథ్ బృందం ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకుంది. ఇందులో భాగంగా మహాగణపతి, బ్రహ్మాంజలి, గోవింద గోవింద, మద్దుగారే, కోలాటం, అలరులు కురియగు, బ్రహ్మమొక్కటే, తక్కువైమమనకు, కొండల్లో నెలకొన్న వంటి పాటలకు కళాకారులు తేజోమయి, కుషల, సహస్ర, మేఘన, హన్షిక, కుందన్, ఈష, షణ్ముఖ, ప్రేమ, భవిష్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నత్యాలను ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందించారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వలి సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ముఖ్యఅతిథులు

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో ఆదివారం వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్వీయూ వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.శ్యామ్ డేవిడ్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్య అత్యుత్తమ ప్రతిభగల ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం సంతోషకరమన్నారు. అట్టడుగు వర్గాలు, మహిళలకు విద్య, సంపద వంటి సమస్త హక్కులు నిరాకరించబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, మనువాద సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారత దేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలిగా పాఠశాలలు ప్రారంభించిన వీరవనిత సావిత్రిబాయి అని అభివర్ణించారు. 1848 మే 12న దేశంలో బహుజనుల కోసం మొట్టమొదటి పాఠశాల ప్రారంభించిన సంస్కర్త సావిత్రిబాయి పూలే అని గుర్తు చేశారు. తుడా సెక్రటరీ వెంకట నారాయణ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే నిమ్న వర్గాల అభ్యున్నతికి, కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి అన్నారు. అనంతరం ప్రతిభగల ఉత్తమ ఉపాధ్యాయులను ముఖ్యఅతిథులు సత్కరించారు. కార్యక్రమంలో పద్మావతి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ మహదేవమ్మ, డాక్టర్ శ్రీరాములు, రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ అధ్యక్షుడు టి.గోపాల్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మధుసూదన్, రాయలసీమ మిమిక్రీ అకాడమీ గౌరవ అధ్యక్షుడు విజయకుమార్, శివశంకర్ నాయక్, రెడ్డి ప్రసాద్, కడివేటి మునిరత్నం, చంద్రకళ, మునిలక్ష్మి, తేజస్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా..



ఈశ్వర్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: అధైర్య పడొద్దు.. అండగా ఉంటానని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఆదివారం ఆయన చంద్రగిరికి చెందిన టి.ఈశ్వర్‌రెడ్డి కర్మక్రియలకు హాజరయ్యారు. ముందుగా ఈశ్వర్‌రెడ్డి చిత్రపటానికి ఆయన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, కొత్తపాటి కోటి, కొత్తపాటి నాదముని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

65 వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ హరిత ఒక ప్రకటనలో కోరారు. నగరపాలక సంస్థ పరిధిలోని 102 వార్డులలో 65 వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తుదారుడు తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో నివాసితులై ఉండి, 10వ తరగతి పాసై ఉండాలని తెలిపారు. వలంటీర్ల పోస్టుల భర్తీలో 50 శాతం మహిళలకు కేటాయిస్తామని తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకు http://gramawardsachivalayam.ap.gov.in/GSWS/Home/Main&Appication&>volunteerrecruitment వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు 18వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహించి, 19న జాయినింగ్ ఆర్డర్లు ఇవ్వబడుతుందని, ఎంపికైన వలంటీరుకు గౌరవ వేతనంగా నెలకు రూ.5 వేలు వేతనం ఇస్తామని తెలిపారు. అర్హులైన వారు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ హరిత తెలిపారు.

అమ్మగారిపల్లిలో కోడెగిత్తల జోరు



కోడెగిత్తను తరుముతున్న యువకులు

పాకాల: మండలంలోని అమ్మగారిపల్లిలో పరుష పందేలను స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సుందరంగా అలంకరించిన ఎద్దులను బరిలో దించి పరుగులు పెట్టించారు. యువత రెట్టించిన ఉత్సాహంతో ఎద్దులతో పాటు పరుగులు పెట్టారు. అంతేకాకుండా ఎద్దుల కొమ్ములకు కట్టిన పలకలను సొంతం చేసుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. గ్రామంలోని అన్ని కోడెగిత్తల కొమ్ములకు రంగులు అద్ది గ్రామం చుట్టూ ఊరేగించారు. తమ అభిమాన నాయకులు, సినిమా హీరోలు ఉండే పలకలు కట్టి కోడెగిత్తలను వదిలేశారు. తమ కోడెగిత్తను పట్టుకున్న వారికి తగిన పారితోషికం ఇస్తారని ప్రకటించడంతో యువకులు వాటి వెంట పరుగులు తీశారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి పరుష పందేలను చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

15 నుంచి రాష్ట్రస్థాయి చైతన్య యాత్ర

- ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహమ్మద్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న పీర్ మహమ్మద్

తిరుపతి కల్చరల్: నూర్‌బాషా, దూదేకుల కమ్యూనిటీకి అన్ని పార్టీలు రాజకీయ అవకాశాలను కల్పించాలని నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహమ్మద్ డిమాండ్ చేశారు. నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ ఇ.మస్తానమ్మ ఆధ్వర్యంలో ఆదివారం ఆఫీసర్స్ క్లబ్‌లో ఆ సంఘం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు నూర్‌బాషా, దూదేకుల కమ్యూనిటీలో ఒక ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీగా అవకాశాలు రాకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 లక్షల జనాభా ఉన్న నూర్‌బాషా, దూదేకులను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడం తప్ప వారికి ఎలాంటి రాజకీయ ఎదుగుదలకు అవకాశాలు కల్పించలేదన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో నూర్‌బాషా, దూదేకుల కమ్యూనిటీని గుర్తించి అవకాశాలు కల్పించాలన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నూర్‌బాషా, దూదేకుల చైతన్య యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, కోశాధికారి డాక్టర్ పర్ల దస్తగిరి, గౌరవ సలహాదారుడు డాక్టర్ బాబన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందుల్లా ఖాదర్‌బాషా, అధికార ప్రతినిధి హన్నుభాయ్, రాష్ట్ర మహిళా నాయకురాలు రజియా బేగం, దిల్షాద్, హుస్సేనమ్మ, నబి, షాకీరా, తిరుపతి జిల్లా కమిటీ నేతలు షరీఫ్, అన్వర్, రాజేంద్ర, బాబు, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, మండల కమిటీ ప్రతినిధులు హాజరయ్యారు.

సీఎస్ఐ చర్చిలో ఫ్యామిలీ సండే



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న జయకరన్

పాకాల: క్రైస్తవ కుటుంబాల్లో ఐక్యత, ప్రేమానురాగాలు పెంచడానికి ఫ్యామిలీ సండే ఒక వేదికగా దోహదం చేస్తుందని పీసీసీ కమిటీ చైర్మన్ రెవరెండ్ జయకరన్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, వాగ్దానాల కార్డులను ప్రతీ కుటుంబానికి అందజేసి ఆశీర్వదించారు. మధ్యాహ్నం సామూహిక భోజనాలు నిర్వహించి, చర్చి ఆవరణలో యూత్, చిన్నారులకు, మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. చర్చ్ పాస్టర్ ప్రేమ్ కుమార్ సెక్రటరీ రాఘవేలు పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.